మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై ఆరోపణలు సరి కాదు

- బీఆర్‌ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

తుంగతుర్తి, అక్టోబర్ 24 : నియోజకవర్గాన్ని పదేండ్లు అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సబబు కాదని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ పోరాడిన విద్యార్థి ఉద్యమ నాయకుడు గాదరి కిశోర్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయడం హేయమైన చర్య అని అన్నారు. గత కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గంలో రక్తపుటేరులు పారిన నేలపై కాళేశ్వరం జలాలతో పచ్చని పల్లెలుగా మార్చిన ఘనత ఆయనదేనని తెలిపారు. ప్రజాసమస్యలను, ప్రజలకిచ్చిన హామీలను ఏవిధంగా పరిష్కారం చేయాలో ఆలోచించకుండా, ప్రజల బాధల గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకులపై ఆరోపణలు అర్థరహితమని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడినుంచైనా పోటీ చేసే అవకాశం రాజ్యాంగం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, తునికి సాయిలు గౌడ్, గోపగాని శ్రీను, ఉప్పుల నాగమల్లు, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రుద్ర క్రాంతి కుమార్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ సర్పంచులు లకావత్ యాకునాయక్, గుగులోతు వెంకన్న, నాయకులు పులాని, ఉప్పుల నాగమల్లు పాల్గొన్నారు.

'గురవయ్య మరణం బీఆర్‌ఎస్‌కు తీరని లోటు'

గురవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు బెజవాడ శ్రావణ్

నడిగూడెం, అక్టోబరు 24 : మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండారు గురవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురవయ్య కుటుంబాన్ని గురువారం కోదాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు బెజవాడ శ్రావణ్‌పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురవయ్య మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటని అన్నారు. ఆయన వెంట కోదాడ వార్డు కౌన్సిలర్ బెజవాడ శిరీష, బత్తుల ఉపేందర్, మాజీ సర్పంచ్ లంజపల్లి నాగేశ్వర్‌రావు, వల్లాపురం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నూకపంగు ఈదయ్య, రెడ్డిమల్ల శ్రీను, సైదులు, శ్రీను, రాజు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి : బీఆర్‌ఎస్

పాలకవీడు, అక్టోబర్24 : పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు పెరుమాళ్ల సతీశ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రూ.4 వేల కోట్లకు పైగా ఉపకార వేతనాలు బకాయిలు ఉన్నాయని, వాటిని విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్టడీ పూర్తయినా విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని, మరోవైపు ఫీజులు అందక విద్యా సంస్థల యాజమాన్యాలు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మొండిచేయి చూపిస్తున్నదని, ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని కూడా కేటాయించలేదని పేర్కొన్నారు.

ఎన్ఎంకే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేసే వరకూ పోరాటం

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్


మాట్లాడుతున్న నాయకులు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : మోతె మండలం రావిపహాడ్‌లో ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే ఎన్ఎంకే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసే వరకూ తమ పోరాటం ఆగదని, గవర్నర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన తమ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. పోలీసులు తమ పార్టీ నాయకులు తెల్లవారు జామున అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సూర్యాపేటలోని లెనిన్ నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే వేలాది ఎకరాల భూముల రైతులకు ఇబ్బందులు వస్తాయని తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య, పిడమర్తి లింగయ్య, గులాం హుస్సేన్, మారసాని చంద్రకళ, సంతోషిమాతా, జయమ్మ, మోహన్, పద్మ, విజయ్ పాల్గొన్నారు.

'గీత కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాలి'

నూతనకల్, అక్టోబర్ 24 : రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు అందిస్తున్న బీమాపై అవగాహన కల్పించాలని గౌడ జన హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీమా పొందడానికి కావాల్సిన అర్హతలు, తదితర విషయాలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలని కోరారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో నాయకులు మల్లయ్య, రామచంద్రు, ఉప్పులయ్య, శేఖర్, రమేశ్, నాగలింగం, వీరేశం పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి : సీపీఐ

నూతనకల్, అక్టోబర్ 24 : నిరుపేదలకు ఇండ్లు కట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ వారితోనే కమిటీ ఏర్పాటు చేస్తే నిజమైన నిరుపేదలకు ఇండ్లు దక్కవని తెలిపారు. సమావేశంలో రాములు, వీరన్న, సాయిలు, ఉపేందర్, నాగమయ్య తదితరులు ఉన్నారు.

సీపీఎం నేరేడుచర్ల మండల కార్యదర్శిగా సిరికొండ శ్రీను



నేరేడుచర్ల, అక్టోబర్ 24 : సీపీఎం మండల కార్యదర్శిగా సిరికొండ శ్రీనును మండలంలోని ముకుందాపురంలో జరిగిన ఆ పార్టీ మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ శ్రేణులకు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 6304222202.
NT-338782

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, అక్టోబర్ 24 : రక్తదానం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి రక్తం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా 300 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియల్‌కుమార్, కొండల్‌రెడ్డి, రాఘవరావు, ఆర్ఐలు సంతోశ్, నూరప్పనాయుడు, ఎస్ఐలు నాగరాజు, సైదాబాబు, శంకర్, సురేశ్ పాల్గొన్నారు.

పోలీస్ అమరుల కుటుంబాలకు ఎస్పీ పరామర్శ

ఆగస్టు 18, 2006న అత్మకూర్(ఎం) పోలీస్ స్టేషన్‌పై నక్సల్స్ దాడిలో మృతిచెందిన ఏఎస్ఐ సుల్తాన్ మొహినొద్దీన్ ఇంటికి ఎస్పీ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీస్ అమరుల కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు.

నేడు చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ

నీలగిరి, అక్టోబర్ 24 : ప్రజల సమస్యలను వారివద్దకే వెళ్లి తెలుసుకొని పరిష్కరించే దిశగా ఏర్పాటు చేసిన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ఈ నెల 25న చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదులను పరిశీలించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నేడు దర్వేశిపురం ఆలయ దుకాణాలకు టెండర్లు

నల్లగొండ సిటీ, అక్టోబరు 24 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద పలు దుకాణాలను నిర్వహించేందుకు శుక్రవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, పూలు, పండ్లు, గాజులు, కిరాణ సామగ్రి, మిఠాయిలు విక్రయించేందుకు, ఫొటో స్టుడియో దుకాణాలకు టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 11 గంటల లోపు ఆలయ ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.

29న చలో నల్లగొండను జయప్రదం చేయాలి

చిట్యాల, అక్టోబర్ 24 : ఎస్సీ వర్గీకరణ అమలులో సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 29న నల్లగొండలో నిర్వహిస్తున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని సంఘం నియోజకవర్గ ఇంచార్జి మేడి శంకర్ కోరారు. గురువారం చిట్యాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సభకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చాడు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

26న స్వామి సంస్మరణ సభ

చిట్యాల : తెలంగాణ గ్రామ నామాల పరిశోధకుడు మండలి స్వామి సంస్మరణ సభను 26న నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సృజన సాహితీ అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి మండలి స్వామి సంస్మరణ సంచిక, స్నేహ పరిమళం పుస్తకాన్ని ఆవిష్కంచనున్నట్లు తెలిపారు.

బీఈడీ కళాశాలలు ఉత్తమ ఉపాధ్యాయులను తయారుచేయాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, అక్టోబర్ 24: మారుతున్న కాలానికి అనుగుణంగా కరిక్యులమ్‌లో వచ్చే మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు నైపుణ్యాలు పెంచుకొని నవ సమాజానికి అవసరమైన ఉత్తమ ఉపాధ్యాయులను బీఈడీ కళాశాలల్లో తయారు చేయాలని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. ఎంజీయూ పరిధిలోని బీఈడీ కళాశాలల్లోని ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు 2023–25 బీఈడీ బ్యాచ్‌కు అమలు చేస్తున్న కరిక్యులమ్, కో కరిక్యులమ్ అంశాలపై ఎంజీయూ డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని అలాంటి ఉపాధ్యాయులను దేశానికి అందించే గురుతరమైన బాధ్యత బీఈడీ కళాశాలల అధ్యాపకులపై ఉందన్నారు. అనంతరం నూతన బీఈడీ సిలబస్, బోధనాంశాలపై పీపీటీ ప్రజెంటేషన్‌తో ఎన్‌సీటీఈ సభ్యులు, ఓయు ప్రొఫెసర్ పారేపల్లి శంకర్ అవగాహన కల్పించారు. ఓయు అసిస్టెంట్ ప్రొఫెసర్లు జె.లలీత, డి.సునీత, సుజాత, దుర్గేశం వివిధ అంశాలపై వివరించారు. ఎంజీయూకు వీసీగా వచ్చిన హుస్సేన్‌ను ఓయూ ప్రొఫెసర్స్‌తోపాటు బీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సన్మానించారు. ఎంజీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్ సురేశ్‌రెడ్డి, సీడీసీ జయంతి పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి పలువురి ఆర్థికసాయం

మిర్యాలగూడ/మిర్యాలగూడ రూరల్ , అక్టోబర్ 24: మండలంలోని అవంతీపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ నాగయ్య(52)రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం నాగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్ నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులు యాదవ్, నాయకులు చిమట పద్మామదార్, పద్మయ్య, వెంకులు, రాము, భిక్షం ఉన్నారు.

ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ రూ.25 వేలు, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, రూరల్ ఎస్ఐ లోకేశ్ రూ.5 వేలు నాగయ్య కుటుంబానికి అందజేశారు.

నగలు మెరుగు పెడతామని మోసం

త్రిపురారం, అక్టోబర్ 24: నగలకు మెరుగు పెడతామని మోసం చేసిన ఘటన మండలంలోని లక్ష్మీపురంలో గురువారం జరిగింది. కొందరు వ్యక్తులు నగలకు మెరుగుపెడతామని ప్రచారం చేస్తుండగా, గ్రామానికి చెందిన కొంగరి సునీత తన పుస్తెలతాడును మెరుగు పెట్టమని ఇచ్చింది. మెరుగుపెట్టిన అనంతరం పుస్తెలతాడు తూకంలో వ్యత్యాసం కనిపించడంతో మోసపోయానని గుర్తించి స్థానికులకు తెలిపింది. వెంటనే యువకులు వారిని గ్రామ శివారులో పట్టుకొని విచారించగా పుస్తెలతాడు నుంచి మూడు గ్రాముల బంగారం తీసినట్లు ఒప్పుకున్నారు. దాంతో వారిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు బాధితురాలు తెలిపింది. మోసానికి పాల్పడిన వారు హైదరాబాద్ కార్మికనగర్‌కు చెందిన పత్తిపాటి నాగరాజు, బొప్ప వెంకటరెడ్డిలుగా గుర్తించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

మర్రిగూడ, అక్టోబర్ 24 : అన్ని ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో దళారులకు విక్రయిస్తున్నారన్నారు. దాంతో పత్తి వ్యాపారులు క్వింటాకు రూ.5వేలే చెల్లిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి అక్టోబర్ 24: అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం, రోజుల తరబడి ధాన్యం కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వంగా మారిందని ఆరోపించారు. వరికోతలు ప్రారంభమై ఇరవై రోజులు అయినా ధాన్యం కొనుగోలు వేగవంతం కాలేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మార్కెట్‌లు, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే కలెక్టర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ధాన్యం, పత్తి కొనుగోలు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఇస్తామన్న రూ. 500 బోనస్ కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతో పత్తి, ధాన్యం దళారులకు రైతులు రైతులు విక్రయిస్తున్నారన్నారు.

పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నేలవాలిన వరిచేనును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

వేములపల్లి/మాడ్గులపల్లి, అక్టోబర్ 24: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి రైతులను ఆదుకొంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వేములపల్లి మండలంలోని పలు గ్రామాల్లో, మాడ్గుల పల్లి మండలంలోని పాముల పాడు గ్రామంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పత్తి, నేలవాలిన వరి చేలను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే కలెక్టర్‌కు వీడియోకాల్ చేసి జరిగిన పంట నష్టాన్ని చూపించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను సందర్శించి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలియచేయాలని సూచించారు. ఆయన వెంట మాడ్గులపల్లి, మిర్యాలగూడ మండలాల వ్యవసాయాధికారులు శివరాంనాయక్, సైదానాయక్, రైతులు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ఎఫ్ఎస్‌సీఎస్ చైర్‌పర్సన్ సుష్మ, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుష్మ

చండూరు/గట్టుప్పల్, అక్టోబర్ 24: చండూరు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, చండూరు రైతు సేవా సహకార సంఘం అధ్యక్షురాలు కోడి సుష్మా వెంకన్న అన్నారు. మండలంలోని పలు గ్రామాతో పాటు గట్టుప్పల్ మండలం తెరట్‌పల్లి గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, రైతులు దళారులను ఆశ్రయించి మోస పోకుండా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్లు దశరథ, రాములు, ఎంపీడీఓ పి.రాంరెడ్డి, ఏఓ రేవతి, ఏఈఓ నాగార్జున, సంఘం డైరెక్టర్లు, మాజీ ఎంపీటీసీ గౌరిగ సత్తయ్య, ఆంజనేయులు, కార్యదర్శి షఫి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

- అశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజు


కోర్టుతీర్పు పత్రాలు చూపుతున్న సంస్థ ప్రతినిధులు

నల్లగొండ, అక్టోబర్ 24 : దేశంలో బాలల హక్కులను రక్షించడం, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించే విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని అశ్రిత స్వచ్చంద సంస్థ డైరెక్టర్ నాగరాజు అన్నారు. గురువారం స్థానిక అశ్రిత ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎంఎఫ్ఐ 200కుపైగా ఎన్జీఓలతో కూడిన కూటమి 2023–24లో 1.20 లక్షల బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సంస్థ కోఆర్డినేటర్లు వెంకటేశ్, పర్వతాలు, మేరిన్ హెల్లెన్, స్వప్న, సునీత, నాగమణి, ఝాన్సీ పాల్గొన్నారు.

దామరచర్ల రైల్వేగేటు మూడురోజులు మూసివేత

దామరచర్ల, అక్టోబర్ 24: విష్ణుపురం – కొండ్రపోల్ రైల్వేస్టేషన్‌ల మధ్య దామరచర్ల రైల్వేగేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల నుంచి యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు వీర్లపాలెం రహదారిపై ఏర్పాటు చేసిన రైల్వేగేటు వద్ద లెవల్ క్రాసింగ్ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు వాడపల్లి చెక్‌పోస్టు నుంచి ఇర్కిగూడెం వెళ్లే దారి నుంచి వెళ్లాలని అధికారులు సూచించారు.

ఎంజీయూ బ్యాడ్మింటన్ జట్టుకు వీసీ అభినందన

రామగిరి, అక్టోబర్ 24: ఎంజీయూ బ్యాడ్మింటిన్ జట్టుకు ఎంపికై చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే జాతీయస్థాయి బ్యాడ్మింటిన్ పోటీలకు వెళ్తున్న విద్యార్థులను వీసీ అల్తాఫ్ హుస్సేన్ గురువారం అభినందించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చి ఎంజీయూ ఖ్యాతి చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి హరీశ్‌కుమార్, ఎంజీయూ పీడీలు వై. శ్రీనివాస్‌రెడ్డి, మురళి, కోచ్ నారాయణ పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ జిల్లా ఇన్‌చార్జిగా గురునాథం

చండూరు,అక్టోబర్ 24: మాదిగ జేఏసీ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జిగా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన ఇరిగి గురునాథంను నియమిస్తూ మాదిగ జేఏసీ తెలంగాణ అధ్యక్షుడు పిడమర్తి రవి గురువారం ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం పనిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు

రిఫ్రిజిరేటర్ పేలి గుడిసె దగ్ధం

మునుగోడు, అక్టోబర్ 24 : మండల కేంద్రంలోని లక్ష్మీదేవిగూడెం పరిధిలోని జంగాల కాలనీకి చెందిన దుగ్గి శేఖర్‌కు చెందిన గుడిసె గురువారం విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైంది. శేఖర్ ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ పేలడంతో మంటలు ఇంటి కప్పునకు అంటుకొని గుడిసె దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. రెవెన్యూ అధికారులు పంచానామ నిర్వహించారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించారు.

'ఐక్యరాజ్య సమితి బాధ్యత గురుతరమైంది'

నకిరేకల్, అక్టోబర్ 24 : ప్రపంచ దేశాల మధ్య శాంతి సామరస్యాలను కాపాడి, సరిహద్దు వివాదాలను పరిష్కరిస్తూ అన్ని దేశాలను సుస్థిరాభివృద్ధి దిశగా నడిపిస్తూ ఐక్యరాజ్యసమితికి గొప్ప గురుతర బాధ్యత నిర్వర్తిస్తున్నదని నకిరేకల్ పట్టణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య అన్నారు. గురువారం ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల రాజనీతి శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వి.విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కట్టంగూర్ కార్యవర్గం ఎన్నిక

కట్టంగూర్, అక్టోబర్ 24 : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కట్టంగూర్ పట్టణ కార్యవర్గాన్ని గురువారం నియోజకవర్గ కన్వీనర్ ముడుసు భిక్షపతి, మండల అధ్యక్షుడు గండమల్ల అంతయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బొల్లెద్దు నర్సింహ, కో కన్వీనర్‌గా గోగు పెద్ద రాంబాబు, ఉపాధ్యక్షులుగా గోగు శంకర్, యన్నమల్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా గోగు శేఖర్, కార్యదర్శిగా గోగు మహేశ్, గోగు రవి, కోశాధికారిగా బొల్లెద్దు లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బత్తుల నర్సింహ, ఎన్నమల్ల శంకర్, గండమల్ల కిషన్, బొల్లెద్దు నాగరాజు, గోగు మధు, ఆంజనేయులు, బొల్లెద్దు శివ, ఎన్నమల్ల వినోద్, బొల్లెద్దు రమేశ్ ఎన్నికయ్యారు.

ఎంజీయూలో ఎన్‌సీసీ కార్యాలయం ప్రారంభం

రామగిరి, అక్టోబర్ 24: 31వ ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ సహకారంతో ఎంజీయూలో ఎన్‌సీసీ కార్యాలయాన్ని వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌న, ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ లక్షారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ రక్షణలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ మాధవరావు, వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా గురుకుల క్రీడలు

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్24: శ్రీనివాసనగర్‌లోని దామరచర్ల బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడాపోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. అండర్–17 విభాగం కబడ్డీ జట్ల క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఉమాదేవి పరిచయం చేసుకొని సుభాకాంక్షలు తెలిపి, క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ పోటీలో దామరచర్ల ప్రథమ, తుమ్మడం ద్వితీయస్థానం దక్కాయి. ఫైనల్ మ్యాచ్‌లో దామరచర్ల–తుమ్మడం జట్లు తలపడ్డాయి. దామరచర్ల జట్టు 17 పాయిట్ల అధిక్యంతో విజేతగా నిలిచింది. ఖోఖో అండర్–17 నల్లగొండ జట్టు ప్రథమ, వలిగొండ గురుకులం రెండో స్థానంలో నిలిచింది.

గాలి వానకు 625 ఎకరాల్లో పంటనష్టం : ఏఓ

త్రిపురారం, అక్టోబర్ 24: ఇటీవల కురిసిన గాలి వానకు మండలంలోని బెజ్జికల్, బొర్రాయిపాలెం, అంజనపల్లి, త్రిపురారం, రాగడప, కొణతాలపల్లి, బాబుసాయిపేట గ్రామాల్లో సుమారు 625 ఎకరాల్లో వరిచేలు నేలకొరిగినట్లు ఏఓ పార్వతీచౌహాన్ తెలిపారు. గురువారం ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న వరిచేలను ఆమె పరిశీలించారు. నేలకొరిగిన చేలో వరి కంకుల నుంచి మొలకలు వస్తున్నాయని, గింజ గట్టి పడకముందే వరి పంట నేలకొరగడంతో నీళ్లల్లో ఉన్న కంకులన్నీ కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు.

ఘనంగా గణిత దినోత్సవం

రామగిరి, అక్టోబర్ 24: ఎంజీయూలోని సైన్స్ కళాశాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. కొల్లోజు ఫణీంద్ర గణిత విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ వసంత, గణిత విభాగం హెచ్‌వోడీ పి.మద్దిలేటి, కన్వీనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో చిన్న సినిమాల నటుడు మృతి

చందంపేట(నేరేడుగొమ్ము), అక్టోబర్ 24 : నేరేడుగొమ్ము మండలంలోని తిమ్మాపురం చెంచుకాలనీకి చెందిన జెల్ల విజయ్(46) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. కాగా తిమ్మాపురం చెంచుకాలనీ నుంచి సినిమాలో నటించాలనే ఉత్సాహంతో పలు చిన్న సినిమాల్లో నటించాడు. దీంతో చెంచుకాలనీలో విజయ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న విజయ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి పాలనలో గాడితప్పిన విద్యావ్యవస్థ

హాలియా, అక్టోబర్ 24 : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అకారపు నరేశ్ అన్నారు. గురువారం హాలియాలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న విద్యావ్యవస్థనే సరైన మార్గంలో నడపలేక పోతున్నారని, ఇక మిగతా శాఖల పని ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిఫ్ విడుదల చేయకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. సమావేశంలో సంఘం డివిజన్ నాయకులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేశ్, చందు, సాయి, వర్షిత్, నాగరాజు, అనిల్, మనోజ్, నవీన్ పాల్గొన్నారు.

రైతుల ప్యాడీ క్లీనర్లు వాడాలి : డీఎస్ఓ

నల్లగొండ సిటీ, అక్టోబరు 24 : రైతుల తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్లు వాడాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం కనగల్ మండలం పర్వతగిరి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం డీఎస్ఓ మాట్లాడుతూ ప్యాడీ క్లీనర్ వినియోగించి ధాన్యంలో తాలు, ఇతరాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీసం నాలుగు కాంటాలు, రెండు తేమ చూసే యంత్రాలు, 30 టార్పాలిన్లు అందుబాటులో ఉంచాల న్నారు. నిబంధనల మేరకు 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాంటాల వేసి, కనగల్ మార్కెట్ యార్డుకు పంపించాలని కోరారు. ఏపీఎం సంకుహరి, డీటీ జోత్స్నశ్రీ, సీసీలు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హాలియా, అక్టోబర్ 24 : గుర్రంపోడు మండలం కోయిగూరోనిబావి గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఐకేపీ కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ దాడుల్లో నల్లబెల్లం పట్టివేత

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 24: ఎస్టీఎఫ్ దాడుల్లో రూ.3 లక్షల విలువైన నల్లబెల్లాన్ని పట్టుకున్నారు. తిరుమలగిరి మండలంలోని జమ్మనకోటతండాలో గురువారం అక్రమంగా నల్లబెల్లం దాచి ఉంచారన్న సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన ఎస్టీఎఫ్ ఎస్ఐ బాలరాజు తన సిబ్బందితో గోదాంపై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టగా 300 కేజీల నల్లబెల్లం, 50 కేజీల ఆలం, 10లీటర్ల నాటుసారా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన కృష్ణానాయక్ నాటుసారా తయారీ కోసం రూ.3 లక్షల విలువైన నల్లబెల్లాన్ని గోదాంలో ఉంచగా పోలీసులు పట్టుకున్నారు. దాడుల్లో హాలియా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ కల్పన, ఎస్ఐ సంపత్ పాల్గొన్నారు. పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఎస్టీఎఫ్ టీం లీడర్ ప్రదీప్‌రావు అభినందించారు.

పెట్రోల్ బంక్‌లో తూనికల శాఖ అధికారుల తనిఖీ

కట్టంగూర్, అక్టోబర్ 24 : మండలంలోని పామనుగుండ్ల గ్రామంలోని ఆర్వీ ఫిల్లింగ్ స్టేషన్‌లో గురువారం తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ తనిఖీలు నిర్వహించారు. మీటర్, మదర్ బోర్డుతో పాటు సిప్‌ను పరిశీలించారు. పెట్రోల్ కొలతల్లో తేడాలున్నట్లు వినియోదారుడి ఫిర్యాదు మేరకు తనఖీ చేపట్టినట్లు తెలిపారు. బంక్‌లో అవకతవలు జరిగినట్లు నిర్ధారణ కాలేదన్నారు. సివల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి ఉన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతా శరత్‌కుమార్ అనే వ్యక్తి ఆర్వీ బంక్‌లో కారుతో వచ్చి పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేయమని సిబ్బందికి చెప్పాడు. ట్యాంక్ నింపిన సిబ్బంది 42లీటర్ల పెట్రోల్ పట్టినట్లు చెప్పగా.. తన కారులో 35 లీటర్ల పెట్రోల్ మాత్రమే పడుతుందని సిబ్బందిపై దాడికి యత్నించారు. బంక్ సూపర్ వైజర్ జానయ్య ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. బంక్ సిబ్బంది దుర్భాషలాడినట్లు శరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు బంక్ సిబ్బందిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారు పల్టీ, ఒకరికి గాయం

కేతేపల్లి, అక్టోబర్ 21: విజయవాడకు చెందిన అమరేంద్రచౌదరి తన కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా కేతేపల్లి సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో అమరేంద్ర స్వల్పగాయాలతో బయటపడ్డాడు.